క్లుప్తంగా

రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ఉన్న రైతుకే ఓటు హక్కు

ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్

పెడన: నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఆయా సాగునీటి కాలువల పరిధిలో ఉన్న పంట పొలాలకు చెందిన రైతులను రిజిస్టర్డ్ డాక్యుమెంట్సు ఎవరి పేరుతో ఉన్నాయో వారినే రైతులుగా నమోదు చేయాలని ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన పట్టణ, మండలంలోని వీఆర్వోలతో సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు సాగునీటి ఎన్నికలకు సంబంధించి పంచాయతీల వారీగా సర్వే నంబర్లు నోటీసు బోర్డుల్లో పెడతారని, ఆరో తేదీ నుంచి రైతులను సాగునీటి సంఘాల ఎన్నికలకు ఓటర్లుగా నమోదు చేయాల్సిన బాధ్యత వీఆర్వోలదేనన్నారు. ప్రతి రైతు గురించి సంబంధిత వీఆర్వోకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. డాక్యుమెంట్స్ ఎవరి పేరుతో అయితే ఉంటాయో ఆ రైతులను మాత్రమే ఓటరుగా నమోదు చేయాలన్నారు. కౌలు రైతులు, చెరువులున్న వారిని పక్కన పెట్టాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారి విషయంలో తదుపరి నిర్ణయం తీసుకుందామని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఆర్‌ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు సత్కారం



మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జి.భానుమూర్తికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మంగళవారం అభినందనలు తెలిపారు. భానుమూర్తికి శాలువా కప్పి పూలమాల వేసి సత్కరించి అభినందనలు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ డైరెక్టర్ చీలి రవీంద్ర ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

పత్రదివర(నాగాయలంక): స్థానిక గ్రామ పంచాయతీ శివారు దుర్గాప్రసాదపురంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మెండు నాగమల్లేశ్వరరావు కుటుంబానికి బొండాడ గ్రూప్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో రూ.25 వేలు ప్రకటించారు. ఇదే గ్రామానికి చెందిన ఈ సంస్థ సీఎండీ బొండాడ రాఘవేంద్రరావు ఆయన సోదరి అల్లపర్తి జయంతి ద్వారా మంగళవారం గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఈమొత్తం నగదును నాగమల్లేశ్వరరావు దంపతులకు అందచేశారు. బొండాడ శివపార్వతి, మండలి మహేష్, వంగర శేషగిరావు పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

ట్రాఫిక్ సీఐ శివకుమార్

కోనేరుసెంటర్: రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని బందరు ట్రాఫిక్ సీఐ శివకుమార్ తెలిపారు. మంగళవారం ఆదిత్య డిగ్రీ కళాశాలలో రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలపై ఆదిత్య డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించగలుగుతామన్నారు. వాహనదారులు హెల్మెట్, సీటుబెల్ట్ వంటి భద్రతా పరికరాలు తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. భద్రత ప్రమాణాలు పాటించకుంటే అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారు. వాహనదారులు మొదట రోడ్డు భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ తెలుసుకోకుండా బైక్‌లపై రోడ్ల పైకి వస్తే ప్రమాదాలకు కారకులవుతారన్నారు. తద్వారా పోలీసు కేసులతోనూ ఇబ్బంది పడే పరిస్థితి ఎదురవుతుందన్నారు. ట్రాఫిక్ ఎస్సైలు ఎస్.వెంకటేశ్వరావు, టి.మధుసూదనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరటి తోటలతో ఆదాయం, ఆరోగ్యం

దాలిపర్రు(ఘంటసాల): పెరటి తోటలు పెంపకం ద్వారా ఆరోగ్యంతో పాటు ఆదాయం వస్తుందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. మండలంలోని దాలిపర్రు గ్రామంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పెరటి తోటల పెంపకంపై మహిళలకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ పెరటి తోటలు పెంపకం చేపట్టాలని మహిళలకు సూచించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి, మత్స్య శాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ మాట్లాడారు. విత్తనాల కిట్లను సుధారాణి పంపిణీ చేశారు. దాలిపర్రు సర్పంచ్ దోకిపర్తిశాంతకుమారి,మహిళలు పాల్గొన్నారు.

కడప ఉరుసు మహోత్సవానికి ఆహ్వానం

మచిలీపట్నంటౌన్: ఈ నెల 17వ తేదీన కడపలో జరిగే ఉరుసు మహోత్సవానికి రావాలని కోరుతూ దర్గా ప్రతినిధి బృందం మంగళవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)కు ఆహ్వాన పత్రం అందజేశారు. అలాగే మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదాకు కూడా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆహ్వానించిన వారిలో దర్గా కమిటీ ప్రతినిధి జిలాని, సభ్యులు ఉన్నారు.



ఆటో ఎక్కుతున్న భక్తులు



ఖాళీగా వెళుతున్న ఆర్టీసీ బస్సు



బస్ కోసం ఆర్టీసీ అధికారితో మాట్లాడుతున్న మహిళ



మోపిదేవిలో ఆర్టీసీ బస్ నుంచి జాతీయ రహదారిపై దిగుతున్న ప్రయాణికులు

ఆటోలు ఫుల్.. ఆర్టీసీకి నిల్

ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ వల్లీదేవసేనస సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానానికి ఉన్న ప్రాధాన్యత ప్రజలకు తెలియంది కాదు. అయితే ఈ సందర్భాన్ని ఆర్టీసీ అధికారులు గుర్తించలేకపోయారు. ఆలయం సమీపానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయకుండా హైవేలో ప్రయాణికులను దించేయడమే ఇందుకు నిదర్శనం. నాగులచవితి సందర్భంగా దూరప్రాంతాలనుంచి మంగళవారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆర్టీసీ, పోలీస్ అధికారుల అనాలోచిత నిర్ణయంతో ప్రయాణికులు ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. నేషనల్ హైవేపై ప్రయాణికులను దించివేయడంతో నానా అగచాట్లు పడాల్సి వచ్చిందని భక్తులు వాపోయారు. అవనిగడ్డ వైపు, విజయవాడ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సు ప్రయాణికులను మోపిదేవి గ్రామానికి బైటే దించివేయడంతో భక్తులు అక్కడి నుంచి అర కి.మీ దూరం నడవలేక కొంతమంది ఆటోలలో ప్రయాణించగా, మరికొంతమంది నడవక తప్పలేదు. ఈ కారణంగా ఆటోలకు మంచి గిరాకి ఏర్పడగా, ఆర్టీసీ బస్సులు కొన్ని ఖాళీగానే వెళ్లాయి.

– మోపిదేవి

అత్యంత వైభవోపేతంగా పవిత్రోత్సవాలు

అభినవ మేల్కోటలో ఆధ్యాత్మిక శోభ

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం గ్రామంలో ఆధ్యాత్మిక శోభతో ఉట్టిపడింది. గ్రామంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ, అష్టాక్షరీ బృందావన స్వామిజీ పర్యవేక్షణలో మంగళవారం ఉదయం స్వామివార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక తిరుచ్చిపై ఆలయ పుర వీధులు వెంట ఊరేగించారు. వేదపండితుల మంత్రవచనాల నడుమ స్వామివార్లకు పంచామృతాభిషేకాలను కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, కలశపూజలను చేశారు. నమ్మాళ్వర్లు, రామానుజీయర్ స్వామి వారి ఆలయాల్లో కూడా పూజలు నిర్వహించారు. నకిరేకల్లు, విజయవాడకు చెందిన 20 మంది పండితుల వేదమంత్రఘోష నడుమ స్వామివార్లకు పవిత్రాలను అలంకరించారు. గర్భాలయంలోని 11 అడుగుల శ్రీమన్నారాయణుడి మూలమూర్తితో పాటు ఉపాలయాల్లోని రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లకు కూడా పవిత్రాలతో అలంకారం చేశారు. ఏడాది పొడవునా ఆలయంలో స్వామివారికి జరిగే పూజాది కార్యక్రమాల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే, ఈ పవిత్రోత్సవాల ద్వారా వాటి నివారణ జరుగుతుందని అష్టాక్షరీ స్వామిజీలు చెప్పారు.



స్వామివార్ల ఉత్సవమూర్తులకు పవిత్రాలతో అలంకారం

లింగన్నకోడుపై వంతెన ప్రారంభం

కోడూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు కేటాయించి నిర్మించిన వంతెనను బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, రాజ్యసభ మాజీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ మంగళవారం ప్రారంభించారు. మండలంలోని నరసింహపురం గ్రామంలో లింగన్నకోడుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో కుప్పకూలింది. దీంతో అప్పటి వైఎస్సార్‌సీపీ ఎంపీగా ఉన్న బాలశౌరి, రాజ్యసభ్యుడిగా రవీంద్రబాబులు ఈ వంతెన నిర్మాణానికి రూ.43.40 లక్షల నిధులు కేటాయించారు. వంతెన నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా ప్రారంభించి, సుమారు 70 శాతం పనులను పూర్తి చేసింది. ప్రస్తుతం నిర్మాణం పూర్తి కావడంలో ఇప్పుడు ఈవంతెనను ప్రారంభించారు. ఈ వంతెన నిర్మాణ ద్వారా సాలెంపాలెం, నరసింహపురం, వేణుగోపాలరావు, నారేపాలెం రైతులు లబ్ధిపొందనున్నారు. ముందుగా నేతలు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

విత్తనశుద్ధితో చీడపీడల నివారణ

గూడూరు: రబీలో అపరాల సాగు చేపట్టే రైతులు విత్తనాలు చెల్లే ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేపట్టాలని గూడూరు ఎంఏవో కె.ఆంజనేయ కుమార్ రైతులకు సూచించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం గూడూరు, ముక్కొల్లు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కిలో విత్తనాలకు 2.5 గ్రాముల మ్యాంకోజెబ్/కార్బన్‌డిజమ్ వంటి తెగులు మందులతో గానీ 5 ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్/థయోమెక్సామ్‌తో కలిపి విత్తన శుద్ధి చేయాలన్నారు. ఫలితంగా 15 నుంచి 20 రోజుల వరకు పంటకు తెగుళ్ల ఆశించవని, రసం పీల్చు పురుగుల బారినుంచి కాపాడుకోవచ్చన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం

అవనిగడ్డ: స్థానిక 9వ వార్డులో రూ.16.60 లక్షల ఎంపీ లాండ్స్ నిధులతో నిర్మించిన నాలుగు సీసీ రహదారులను ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాలను కలపేందుకు వంతెనలను నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర, ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, మండలి వెంకట్రామ్, నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల దరఖాస్తుల స్వీకరణ

బంటుమిల్లి: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలను పురస్కరించుకుని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు ఓటర్ల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మంగళవారం స్థానిక లక్ష్మీపురం సెంటర్లో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పట్టభద్రుల వద్ద నుంచి వచ్చిన దరఖాస్తులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బుధవారం తో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. బంటుమిల్లి మండలం నుంచి 170 దరఖాస్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.

700 దరఖాస్తుల స్వీకరణ

గూడూరు: కృష్ణా, గుంటూరు శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గానికి అర్హులైన పట్టభద్రులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి కోరారు. ఇప్పటి వరకు పట్టభద్రుల ఓటు హక్కు కోసం 700 దరఖాస్తులు వచ్చాయని ఆమె వెల్లడించారు. ఓటు హక్కు దరఖాస్తుల స్వీకరణకు బుధవారం చివరి రోజు అని, అర్హులైన పట్టభద్రులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో తమ దరఖాస్తులు సమర్పిం చవచ్చన్నారు. ఓటరు దరఖాస్తుతో పాటు ఫొటో, గెజిటెడ్ అధికారి అటెస్టేషన్‌తో కూడిన డిగ్రీ సర్టిఫికెట్, ఓటరు కార్డు, ఆధార్‌కార్డు సమర్పించాలని ఆమె స్పష్టం చేశారు.

14న సైకిల్ స్టాండ్ నిర్వహణకు వేలం

మచిలీపట్నంటౌన్: స్థానిక రైతు బజారులో సైకిల్ స్టాండ్ నిర్వహణ హక్కు కోసం ఈ నెల 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్టేట్ అధికారి ఎస్.అమీర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక డిస్ట్రిక్ అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ కార్యాలయంలో ఈ బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఆ రోజు మధ్యాహ్నం ఒంటి గంట వరకు దరఖాస్తులు స్వీకరించటం జరుగుతుందన్నారు. వివరాలకు రైతుబజారులో సంప్రదించాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వండి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీసీఎల్‌ఏ కమిషనర్ జయలక్ష్మి

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీసీఎల్‌ఏ కమిషనర్ జయలక్ష్మి జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం అమరావతి సచివాలయం నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రజాసమస్యల పరిష్కారం, ఫ్రీ హోల్డ్ భూముల వెరిఫికేషన్, నీటి తీరువా పన్ను వసూళ్లపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి సంబంధించి ఏ ప్రాంతంలో ఏయే సమస్యలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయో గుర్తించి, ఆయా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. రీఓపెన్ అయ్యే సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి శాశ్వత పరిష్కారం చూపుతున్నామన్నారు. ప్రతి సోమవారం మీకోసం నిర్వహించినప్పుడు మీ–సేవా ద్వారా అందించే పౌరసేవలకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరించేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్‌కు కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ గీతాంజలిశర్మ, ఇన్‌చార్జ్ డీఆర్వో బి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో శ్రీదేవి

ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో రహదారుల గుంతలు పూడ్చే పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఆర్‌అండ్‌బీ, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గుంతలు పూడ్చే పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. పనులు చేసినవెంటనే బిల్లులు త్వరగా వచ్చేలా కృషి చేయటం జరుగుతుందన్నారు. అధికారులు కాంట్రాక్టర్‌లకు బిల్లులు వెంటనే మంజూరయ్యేలా చూడాలన్నారు. సీఎఫ్ఎంఎస్‌లో సమస్యలు వస్తే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. అగ్రిమెంట్ నిబంధనల మేరకు నాణ్యతగా చేయాలని, ఈ విషయంలో రాజీ పడవద్దని కలెక్టర్ సూచించారు. ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.లోకేష్, డీఈలు ఎస్ సంగీత, డి.బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

550 మందికి కంటి వైద్య పరీక్షలు

నాగాయలంక: బొండాడ గ్రూప్ (హైదరాబాద్) ఆర్థిక సౌజన్యంతో, స్థానిక సుదర్శిమానవతా సేవా సంస్థ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి (విజయవాడ) ఆధ్వర్యంలో మంగళవారం నాగాయలంక లోని శ్రీవాసవీ కల్యాణ మండపంలో 55 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్స్‌కు ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బొండాడ గ్రూప్ అధినేత రాఘవేంద్రరావు చేపడుతున్న సామాజిక సేవలతో పేద ప్రజలకు ఎంతగానో మేలు చేకూరుతుందని కొనియాడారు. శిబిరంలో 550 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 400 మందిని ఉచితంగా కళ్లజోళ్లు అవసరమైనవారిగా గుర్తించారు. ఈనెల 29వ తేదీన బొండాడ గ్రూప్ అధినేత రాఘవేంద్రరావు పుట్టినరోజు సందర్భంగా కళ్లజోళ్లు అందిస్తామని సుదర్శి సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్, బొండాడ గ్రూప్ ప్రతినిధి వంగర శేషగిరిరావు విలేకరులతో చెప్పారు. ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి (విజయవాడ) నుంచి విజన్ సెంటర్ కోఆర్డినేటర్ టి.నరేష్ నేతృత్వంలో విజన్ నిపుణులు ఎన్.శేఖర్, ఎన్.మల్లికారాణి, కె.శశిరేఖ నేత్ర పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో వక్కపట్లవారిపాలెం సర్పంచి అంబటి శ్యామ్‌ప్రసాద్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వర్రే రాంబాబు, బొండాడ నారాయణరావు, అల్లపర్తి జయంతి, కనిగంటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



నేత్రవైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

18 ప్లస్ ఓటర్లపై దృష్టి సారించాలి

పెడన: పెడన అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 18 ప్లస్ ఓటర్లు చాలా తక్కువగా ఉన్నారనే విషయాన్ని ఉన్నతాధికారులు స్పష్టం చేశారని పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ అన్నారు. వారిపై దృష్టిపెట్టి చైతన్యపరచాలని చెప్పారు. మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావుతో కలిసి పట్టణం, మండలంలోని బూత్‌స్థాయి అధికారులతో పలు విషయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ ముసాయిదా ఓటర్లు జాబితాలను మీ పరిధిలోనివి తీసుకుని వాటిని ఒకటికి రెండు సార్లు క్రాస్ చెక్ చేసుకోవాలన్నారు. కొత్తగా విధుల్లో చేరిన వీఆర్వోలు కూడా తెలియని పరిస్థితి ఉంటే పక్క వారి నుంచి తెలుసుకుని నడుచుకోవాలన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లపై..

పట్టభద్రుల దరఖాస్తులను పెండింగ్‌లో పెడితే శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని, ఓటరు నమోదుకు 6వ తేదీతో గడువు ముగుస్తుందని, అందిన దరకాస్తులను 8వ తేదీలోగా అందించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ టీపీవో సుజనాకుమారి, ఆర్ఐ, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నకిలీ పురుగుమందు విక్రయించిన వ్యక్తిపై కేసు

పెడన: మండలంలోని జింజేరు గ్రామంలో నకిలీ పురుగుమందు అంటగట్టిన వ్యక్తిపై ఎట్టకేలకు రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెడన పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని జింజేరు గ్రామానికి చెందిన ఎంవీ గోవర్ధనరావుకు మూడు ఎకరాల పొలం ఉంది. దోమపోటు అధికంగా ఉండటంతో స్థానికంగా పురుగుమందులు విక్రయించే మామిడి లక్ష్మీనారాయణ వద్ద అందరితో పాటు అతనూ కొనుగోలు చేసి వినియోగించాడు. వరి పంట పూర్తిగా నాశనమైంది. దీంతో రైతు వ్యవసాయ శాఖాధికారులకు ఫిర్యాదు చేశాడు. సైంటిస్టులు వచ్చి నకిలీ పురుగుమందుగా తేల్చి నివేదికలు జిల్లా, మండల స్థాయి అధికారులకు పంపించారు. ఈ నివేదికలు వచ్చిన రెండు నెలలకు వ్యవసాయశాఖాధికారులు నకిలీ పురుగుమందు విక్రయించిన వ్యక్తి ఇంటికి వెళ్లి తనిఖీలు నిర్వహించి ఏమీ దొరకలేదని చెప్పడం విశేషం. చివరకు రైతు ముందుకు వచ్చి పెడన పీఎస్‌లో కేసు పెట్టారు. దీనిపై పెడన ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వాస్తవంగా నకిలీ పురుగుమందులు విక్రయిస్తున్న వ్యక్తిపై వ్యవసాయశాఖ కేసు పెట్టాలి. లేదా ఫిక్సలాన్ కంపెనీ యాజమాన్యం లేదా ఏజెంటు పెట్టాలి. వీరెవ్వరూ కేసు పెట్టడానికి ముందుకు రాకపోవడంపై ఎన్నో అనుమానాలు వ్యక్తమయ్యాయి.

సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగుల వినతి

అవనిగడ్డ: పలు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఏపీ 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మంగళవారం పీహెచ్‌సీ వైద్యులకు వినతి పత్రం సమర్పించారు. 104 సర్వీసుని గతంలోలా పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలని, మూడు నెలల నుంచి రావాల్సిన వేతనాలు వెంటనే ఇప్పించాలని, 2020 నుంచి విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, ఉద్యోగులకు జీవో నంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మూడు సంవత్సరాల నుంచి ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్లు వెంటనే ఇప్పించాలని కోరుతూ అసోసియేషన్ నాయకులు జి. నాంచారయ్య, డీఈవో స్వాతి వేకనూరు, అవనిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు వినతి పత్రాలు సమర్పించారు.

● ఓటు నమోదుకు నేటితో ఆఖరు

మోపిదేవి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజక ఓటర్ల నమోదుకు ఈనెల 6వ తేదీ బుధవారంతో ముగియ నుందని తహసీల్దార్ శ్రీవిద్య మంగళవారం సాయంత్రం తెలిపారు. అక్టోబర్ 1, నుంచి నవంబర్ 6వ తేదీ వరకు పట్టభద్రుల ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇంకా మిగిలిన పట్టభద్రులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

రెండు గ్రామాల్లో ఉపాధి పనుల గుర్తింపు

మోపిదేవి: మండలంలోని మోపిదేవి, మోపిదేవిలంక గ్రామ సచివాలయాల వద్ద ఆయా గ్రామ సర్పంచ్‌లు నందిగం మేరీ రాణి, మోర్ల జ్యోత్సన అధ్యక్షతన జాతీయ గ్రామీణ ఉపాధి పనుల గుర్తింపు గ్రామ సభలు మంగళవారం నిర్వహించారు. రాబోవు 2025–25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి పనులు మోపిదేవి గ్రామ సభలో 120 పంట బోదులు, చెరువులు 2, డొంకరోడ్డు ఒకటి, హార్టికల్చర్ కింద ఎకరా మామిడి సాగు పనులు చేపట్టనున్నట్లు ఎన్‌ఆర్ఈజీఎస్ టీఏ హరి బాబు నాయక్ తెలిపారు. మోపిదేవిలంక గ్రామ సభలో 18 పంట బోదులు గుర్తించినట్లు వివరించారు. ఎంపీపీ రావి దుర్గావాణి, గ్రామ కార్యదర్శులు మల్లేశ్వరావు, రామకోటేశ్వరావు, ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి



కలెక్టర్ బంగ్లాలో వద్ద పుట్టలో పాలు పోస్తున్న కలెక్టర్ బాలాజీ దంపతులు

నాగుల చవితి పర్వదినాన్ని పజలు మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు శైవక్షేత్రాలకు, పుట్టల వద్దకు భక్తులు పెద్ద ఎత్తున చేరుకోవటంతో ఆయా ప్రాంతాలు కిటకిటలాడాయి. మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో పలు ప్రాంతాల్లో ఉన్న పుట్టల వద్దకు, ఆలయాలకు వద్దకు చేరుకుని పాలు పోశారు. పాలతో పాటు గుడ్లు, పండ్లు, పువ్వులు, చలివిడి వేసి పూజించారు. మచిలీపట్నం కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న పుట్టలో కలెక్టర్ డీకే బాలాజీ దంపతులు పాలు పోశారు. మోపిదేవి ఆలయానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కోడూరు, బంటుమిల్లి, పెడన, కృత్తివెన్ను, ఘంటసాల మండలాల్లో ఆయా ప్రాంతాల్లోని శివాలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి, శివ లింగాలకు అభిషేకాలు చేశారు. నాగాయలంక కృష్ణానదీ తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం వద్ద మంగళవారం రాత్రి రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక నాగాభరణం అలంకరించి నవ హారతులు సమర్పించారు.

– మచిలీపట్నంటౌన్/పెడన/మోపిదేవి/నాగాయలంక/కోడూరు/ఘంటసాల



మర్రిపాలెం- నంగేగడ్డ మధ్య శివనాగరాజస్వామి పుట్టలో పాలుపోస్తున్న భక్తులు



కోడూరులో నాగపుట్టలో పాలు పోస్తున్న భక్తులు



నడుపూరు సమీపంలోని ప్రధాన రోడ్డు పక్కన పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



ఘంటసాలలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో..



మోపిదేవిలో నాగపుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



నాగాయలంకలో కోటివత్తులకు జ్యోతి ప్రజ్వలన చేసిన ఉభయదాతలు